

## వికారాబాద్ కలెక్టర్‌సహా అధికారులపై దాడి బాధ్యులను శిక్షించాలి

### డిజిపిని కలిసిన రెవెన్యూ, గెజిటెడ్ అధికారుల సంఘం నేతల వినతి

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా లగ్గిచర్లలో సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, కడా ప్రత్యేక అధికా రి వెంకట్ రెడ్డి సహా ఇతర అధికారులపై జరిగిన దాడిపై పూర్తిస్థాయిలో విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర రెవెన్యూ, గెజిటెడ్ సంఘాల నాయకులు డి జిపి జితేందర్‌ను కోరారు. ఈ మేరకు రెండు సంఘాల నాయకులు మంగళవారం నాడు డిజిపి కార్యాలయంలో డిజిపి జితేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వంలో ఏ పార్టీ అధికారంలో వున్నాదనే విషయం తమకు అనవ సరమని, అధికారులు తమ విధులను తాము నిర్వహిస్తారని, ఏ పార్టీకి వారు అనుకూలంగా ప నిచేయరని, అలాంటపుడు ప్రభుత్వం సూచిం చిన పనిచేసేందుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ సహా ఇతర అధికా రులపై కొందరు కావాలని దాడులకు పాల్పడడం ఏ ంతమాత్రం సరైంది కాదని వారు తెలిపారు. ఇది ముందుగా అనుకున్న పథకం ప్రకారమే దాడికి పాల్పడినట్లుగా వుందని వారు తెలిపారు. దాడికి పాల్పడ్డ వారు ఎంత టి వారైనా వదలకూడదని, అందరిని అరెస్టు చేసి కోర్టులో శిక్షలు పడేలా చూడాలని రెవెన్యూ, గెజిటెడ్ సంఘాల నాయకులు డిజిపిని కోరారు. ఈ తరహా దాడులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. తమ వినతికి డిజిపి సానుకూలంగా స్పందించారని, వికారాబాద్ జిల్లా దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షిస్తామని డిజిపి హామీ ఇచ్చారని వారు వెల్లడించారు.

## ప్లాన్ ప్రకారమే కలెక్టర్‌పై దాడి

### గూండాయిజంతో అధికారులను బెదిరిస్తే ఊరుకునేది లేదు: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రౌడీయిజం, గుండాయిజంతో ప్రభుత్వ అధికారులను బెదిరిస్తే ఊరుకునేది లేదని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. మంగళవారం సిఎల్‌పిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. దాడి కోసం పదిరోజుల ముందు నుండి ఎవరు ఎలా ప్లాన్ చేశారో బయటపెడుతామన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, కలెక్టర్ చొరవ తీసుకొని ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లారన్నారు. పథకం ప్రకారం కొందరు అమాయక రైతులను రెచ్చగొట్టి దాడి చేయించారని, సంఘటన తెలుసుకొని ప్రభుత్వం తరపున విచారణ చేపట్టామన్నారు. ఈ దమన కాండకు పాల్పడిన కుట్రదారులు ఎవరో విచారణ చేస్తున్నామని, ప్రభుత్వం ప్రజాస్వామిక స్ఫూర్తితో ముందుకు వెళ్తుందన్నారు. అధికారం పోయిందని ఆక్రోశంతో ప్రభుత్వం మంచి పని చేస్తోన్నా అడ్డుకుంటున్నారని, మేం వేసే ప్రతి అడుగులో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, పరిశ్రమలు ఏర్పాటు చేద్దామంటే వాటిని బిఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఉన్నతాధికారులపై దాడి వెనక ఎవరున్నారో, రాష్ట్రం అభివృద్ధి కాకుండా చేయాలని ఎవరు చూస్తున్నారో బయటపెడుతామన్నారు. దాడి సంఘటనలో ఎవరి వైఫల్యం ఉన్నా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఏ అంశాన్నైనా రాజకీయం చేయాలనే ఆలోచన మాకు లేదని, కెటిఆర్ ఎందుకు ఢిల్లీ వెళ్ళారో మాకేం తెలుసునన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలు బీజేపీకి ఏటీఎంగా మారాయా? అంటూ ప్రశ్నించారు. ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించిన కెసిఆర్ మాకు వారసత్వంగా ఇచ్చారన్నారు. జార్ఖండ్, మహారాష్ట్రలో కాంగ్రెస్ గెలవబోతుందని అన్నారు.

## మినరల్స్‌లోకి ఖనిజాభివృద్ధి సంస్థ

### అనుమతికై సర్కార్‌కు ప్రతిపాదనలు

### రాష్ట్రంలో గ్రానైట్, సున్నపురాయి నిక్షేపాలు గుర్తింపు

### ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న ప్రైవేటు సంస్థలు

### సొంతంగా తవ్వకాలు జరపాలని సంస్థ నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణలో మినరల్స్ తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండగా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్దతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తోంది. అయితే అనుమతి పొందిన సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో ఇసుకతో పాటు, డోలమైట్, గ్రానైట్, సున్నపురాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీటన్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణయించారు.

## రైతుల ముసుగులో విధ్వంసానికి తెగబడిన బిఆర్‌ఎస్

### తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సుంకెట

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** లగచర్లలో రైతుల ముసుగులో బిఆర్‌ఎస్ విధ్వంసానికి తెగపడిందని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి సుంకెట అన్నారు. వికారాబాద్ కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్, కుడా అధికారిపై హత్య ప్రయత్నాన్ని ఖండిస్తున్నా మన్నారు. విధ్వంసం సృష్టించి ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే దురుద్దేశంతోనే బిఆర్‌ఎస్ పార్టీ కుట్రలో భాగమే ఈ దాడి చాలా ప్లాన్‌గా దాడి చేయించిందన్నారు. బిఆర్‌ఎస్ హయంలో చాలా చోట్ల భూసేకరణ జరిగిందని, రైతులు శాంతి యుత పద్ధతుల్లో నిరసన తెలిపారని, ఎక్కడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. రైతులకు అభ్యంతరాలుంటే శాంతియుతంగా నిరసన తెలుపుతారని, కాని లగచర్లతో కర్రలు రాళ్లతో బిఆర్‌ఎస్ గుండాలతో అధికారుల మీద దాడులు చేయించారంటూ మండిపడ్డారు.

## రెండోరోజు కొనసాగిన డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ

### నేడు రంగారెడ్డి కలెక్టరేట్‌లో విచారణ కొనసాగింపు

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ మంగళవారం తమ బహిరంగ విచారణను కొనసాగించింది. రెండో రోజైన మంగళవారం 42 సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. విజ్ఞప్తుల రూపంలో వారి అభిప్రాయాలను కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ(డీఎస్‌ఎస్) భవన్‌లో మొదటి రోజు బహిరంగ విచారణను ప్రారంభించగా.. రెండో రోజు కొనసాగించింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించింది. నేడు(బుధవారం) రంగారెడ్డి కలెక్టరేట్‌లో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకి చెందిన ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నారు.

# జార్ఖండ్‌లో తొలివిడత 43 సీట్లకు నేడే పోలింగ్

### 10 రాష్ట్రాల్లో 31 స్థానాల్లోనూ ఉపఎన్నికల పోలింగ్

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశంలో జార్ఖండ్ రాష్ట్రానికి జరగనున్న తొలివిడత అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్‌తోపాటు అదనంగా 31 అసెంబ్లీ నియోజక వర్గాల్లో బుధవారం ఉపఎన్నికల పోలింగ్ జరుగనున్నది. వాస్తవానికి 33 నియోజకవర్గాలకు ఉప ఎన్నిక జరగాల్సి ఉన్నా సిక్కింలో రెండు నియోజకవర్గాలకు పోటీలేని ఎన్నిక జరగడంతో ఇపుడు 31 స్థానాలకే ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. హోరాహోరీ ప్రచారం నిర్వహించిన జార్ఖండ్‌లో తొలివిడతగా 43 అసెంబ్లీ నియోజకవర్గాలకు నేడు పోలింగ్‌రుగుతోంది. మొత్తం 15 జిల్లాల్లోని 43 నియోజకవర్గాల్లో 683 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. 43 స్థానాల్లో 17 అన్‌రిజర్వుడు స్థానాలుకాగా 20 ఎస్టీస్థానాలు, ఆరు ఎస్సీ స్థానాలున్నాయి. తొలి విడత ఎన్నికల బరిలో మాజీ సీఎం చంపైసోరెన్, ఆరోగ్యమంత్రి బన్నా గుప్తా, రాజ్యసభ ఎంపి మహువా మాజీ, మాజీ సీఎం మధుకోడా సతీమణి గీతాకోడా, మాజీ సీఎం రఘుబర్‌దాస్ కోడలు పూర్ణిమాదాస్‌లు పోటీలో ఉన్నారు. సోమవారంతోనే ఎన్నికల ప్రచారం సమాప్తం కావడం అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేసుకోవడం అటుంచితే ఇటు అధికారయంత్రాంగం కూడా భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాట్లుచేసింది. తొలివిడత పోటీ ముఖ్యంగా జెఎంఎం ఆధ్వర్యంలోని మహాకూటమి, బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమిలమధ్యనే జరుగుతోంది. జెఎంఎం మొదటి విడతలో 23స్థానాలు, కాంగ్రెస్ పార్టీ 17స్థానాల్లో పోటీచేస్తుంటే ఆర్జేడి ఐదుస్థానాల్లో పోటీకి దిగింది. ఇక బిజెపి 36 స్థానాల్లోను, సుదేష్ మెహతో అజ్‌సూ నాలుగుస్థానాలకు పోటీచేస్తోంది. బీహార్‌సీఎం జెడియు రెండు, చిరాగ్‌పాశ్వాన్ ఎల్జేపి ఒకస్థానంలోను పోటీచేస్తుండటం గమనార్హం. మొత్తం 15,344 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గ్రామీణప్రాంతాల్లో 12,716, పట్టణప్రాంతాల్లో 2628 కేంద్రాలున్నాయి. 950 కేంద్రాల్లో పోలింగ్‌సాయంత్రం నాలుగు గంటలకే ముగిస్తారు. 1152 పోలింగ్‌కేంద్రాలు పూర్తిగా మహిళల ఆధ్వర్యంలోనే పోలింగ్ జరుగుతుంది. 24 కేంద్రాలు దివ్యాంగులైన సిబ్బందిపర్యవేక్షిస్తున్నట్లు ఎన్నికల అదికారి కె రవికుమార్ వెల్లడించారు. ఇప్పటివరకూ 179.14 కోట్ల నగదు, వివిధ వస్తుసామగ్రిని స్వాధీనం చేసుకున్నామని 54 కేసులునమోదుచేసినట్లు తెలిపారు.

ఇక ఉప ఎన్నికలపరంగా పది రాష్ట్రాలతోపాటు కేరళలోని వాయనాడు నియోజకవర్గానికిసైతం బుధవారమే పోలింగ్. ప్రభుత్వాలపై ఈ ఉప ఎన్నికలు ఎలాంటి ప్రభావం చూపించకపోయినా కాంగ్రెస్; ఇండియా కూటమికి ఒక అగ్నిపరీక్షగా మారాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి పార్టీలు ఎలాంటి ప్రభావం చూపించలేక పోవడంతో ఇపుడు ఉప ఎన్నికలపైనే ఇండియా కూటమి దృష్టిపెట్టింది. ఈ అసెంబ్లీ స్థానాల్లో అత్యధికంగా ఎమ్మెల్యేలు లోక్‌సభకు పోటీచేసి గెలవడం వల్లనే వారి ఎమ్మెల్యే స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిం చాల్సి వస్తోంది. మరికొన్ని స్థానాల్లో ఎమ్మెల్యేలు మృతి చెందిన కారణంగా కూడా జరుగుతున్నాయి. రాహుల్ గాంధీ వదులుకున్న వయ నాడులో ఆయన సోదరి ప్రియాంకగాంధీ పోటీకి దిగిన సంగతి తెలిసిందే. కాగా రాజస్థాన్‌లో ఏడు, పశ్చిమబెంగాల్‌లో ఆరు, అస్సాంలో ఐదు, బీహార్‌లో నాలుగు, కర్ణాటకలో మూడు, మధ్యప్రదేశ్‌లో రెండు, ఛత్తీస్‌ఘర్, గుజరాత్; కేరళ, మేఘాలయల్లో ఒక్కొక్కటిచొప్పున ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.




ఈనెల 23వ తేదీ జార్కండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఓట్లలెక్కింపునిర్వహిస్తారు. సిక్కింలోని రెండుస్థానాలకు నోటిఫికేషన్ ఇచ్చినా ఆ స్థానాల్లో అంటే సోరెంగ్ చాకుంగ్ నాంచి, సింఘిథాంగ్‌లలో సిక్కిం క్రాంతికారి మోర్చా నామినీలు ఆదిత్య గోలే, సతీష్‌చంద్ర రాయ్‌లు ఎలాంటి పోటీలేకుండా ఎన్నికయ్యారు. వారి ప్రత్యర్థులు పోటీనుంచి తప్పుకోవడంతో వారి ఎన్నిక సులువయింది. ముందు యుపిలో తొమ్మిది సీట్లకు, పంజాబ్‌లో నాలుగు కేరళలో ఒకస్థానానికి 13వ తేదీనే ఉప ఎన్నికలు ప్రకటించినా పండుగల దృష్ట్యా ఇక్కడ ఉపఎన్నికలను 20వ తేదీకి ఎన్నికల సంఘం మార్చింది.

## సిఎం జిల్లాలో ఇంటెలిజెన్స్, పోలీస్ వైఫల్యం

### ఐఎఎస్‌లకు భద్రత కల్పించని పోలీసులు, ఉన్నతాధికారులపై వేటు తప్పదా?

### కిందిస్థాయికే పరిమితంచేసి చేతులు దులుపుకొంటారా?

**ప్రభాతవార్త, వికారాబాద్‌జిల్లా ప్రతినిధి:** సిఎం రేవంత్ సొంత జిల్లాలో పోలీస్ వైఫల్యం సాక్షాత్కరించింది. ఏకంగా ఇద్దరు ఐఎఎస్, ఇద్దరు జిల్లా అధికారులను, కొంతమంది మండల స్థాయి అధికారులను పట్ట పగలే దాడి చేసి కొట్టారు. గత రెండు నెలలుగా దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీలకు భూసేకరణ అంశం వివాదంగా మారిన విషయం అందరికీ తెల్సిందే. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా సోమవారం జిల్లా అధికార యంత్రాంగం పర్యటిస్తున్న విషయం తెలిసినా అక్కడ నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భారీ బందోబస్తు కల్పించాలి. ఇంటెలిజెన్స్, పోలీస్ అధికారులు ఎప్పటి కప్పుడు అక్కడ పరిస్థితులపై ఆరా తీసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఇదంతా అంతర్గత వ్యవహారం అయినప్పటికీ ఈ విభాగాల వైఫల్యం వల్ల పరిస్థితి అదుపు తప్పిందని భావిస్తున్నారు. రైతులు కొంత కాలంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. వారి డిమాండ్ల గురించి ఇప్పటికే ప్రభుత్వం వరకూ వచ్చింది. గతంలో పలు జిల్లాల్లో జరిగిన భద్రతా వైఫల్యం సంఘటనల్లో ఉన్నతాధికారి, సబ్ డివిజన్, సర్కిల్, స్థానిక అధికారులు బాధ్యత వహించారని అధికార వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఉన్నతాధికారులను బదలీచేసి కింది స్థాయి అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం పోలీస్ శాఖలో పరిపాటి. మరి ఏకంగా సీఎం ప్రాతినిద్యం వహిస్తున్న జిల్లాలో జరిగిన లోపలపై పోలీస్ ఉన్నతాధి కారులు చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. వాస్తవానికి పోలీస్ అధికారుల సాధారణ బదిలీల ప్రక్రియ కూడా ప్రస్తుతం జరుగుతున్నందున ఎవరిపై వేటు పడుతుందో వేచి చూడాల్సిందే. మరోవైపు ఐఎఎస్ అధికారులపైనే దాడి జరుగడం పట్ల ప్రజా సంఘాలే కాకుండా ఉద్యోగ, అధికారుల సంఘాలు కూడా భగ్గు మంటున్నాయి. దాడి చేసిన వారినే కాకుండా భద్రత కల్పించని అధికారులపైనా వేటు వేయాలని డిమాండ్లు వస్తున్నాయి.

## నడిచివెళ్తున్న మహిళలను ఢీకొన్న కారు

### పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘోరప్రమాదం

### ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

**పెద్దపల్లి క్రైం, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాలి నడకన వెళ్తున్న నలుగురు మహిళలను అతి వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఒక్కసారిగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పెద్దపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి పట్టణం ఉదయ్ నగర్‌కు చెందిన కుక్క అమృత (50), కుక్క భాగ్య (48) ఈ ఘటనలో మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలు కుక్క పద్మ, కుక్క కాంతమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఉదయ్ నగర్‌కు చెందిన నలుగురు మహిళలు సోమవారం సాయంత్రం స్థానిక రంగంపల్లిలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో కూలీ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పనులు ముగించి మంగళవారం వేకువజామున 4.30గంటల సమయంలో తిరిగి ఉదయ్ నగర్‌లోని వారి ఇండ్లకు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఆదర్శనగర్ వద్ద నలుగురు మహిళలను కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వస్తున్న ఓ కారు అతి వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఆపై కారు డ్రైవర్ కారును ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనలో కుక్క అమృత, కుక్క భాగ్య అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు కుక్క పద్మ, కుక్క కాంతమ్మ తీవ్ర గాయపడగా, స్థానికంగా ఉన్న చికెన్ సెంటర్ నిర్వాహకుడు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి సిఐ కొండపాక ప్రవీణ్ కుమార్, ఎస్ఐ జె.లక్ష్మణ్ రావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రస్తుతం కుక్క పద్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా, మరో మహిళ కుక్క కాంతమ్మ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే మహిళలను ఢీకొన్న కారును గుర్తించేందుకు సిసి కెమరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు పెద్దపల్లి సిఐ కొండపాక ప్రవీణ్ కుమార్ తెలిపారు. త్వరలోనే నిందుతున్ని పట్టుకుంటామని తెలిపారు. కాగా కుక్క అమృతకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, కుక్క భాగ్యకు ముగ్గురు కూతుళ్ల ఉన్నారు. ఒకే కాలనీకి చెందిన నలుగురు మహిళలు రోడ్డుకు ప్రమాదం గురి కాగా, అందులో మహిళలు మృతి చెందడం, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో ఒక్కసారిగా ఆ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## జపాన్‌లో పర్యటిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 12:** తెలంగాణ అసెంబ్లీ బృందం మంగళవారం జపాన్ దేశ పర్యటించింది. పర్యటనలో భాగంగా జపాన్ రాజధాని టోక్యో లోని మహాత్మాగాంధీ విగ్రహానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర శాసన బృందంతో పాటుగా మహాత్మాగాంధీకి విగ్రహానికి సిక్కిం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఎంబసీ సెక్రటరీ ఇన్ జపాన్ వెంట ఉన్నారు. ఆస్ట్రేలియా లోని సిడ్నీలో జరిగిన 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం స్టడీ టూర్ లలో భాగంగా న్యూజిలాండ్ దేశంలో పర్యటించి అనంతరం తెలంగాణ శాసన బృం దం జపాన్ చేరుకుంది. జపాన్ దేశ పర్యటనలో భాగంగా మొదట జపాన్ లో భారత దేశ అంబాసిడర్ సిబి జార్జ్ ను మర్యాదపూర్వకంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు కలిశారు.



## అధికారులపై దాడి గూండాల కుట్ర

### దాడుల్లో మా పార్టీ వాళ్లు ఉన్నా వదలొద్దు

### లగచర్ల ఘటనపై చేవెళ్ల ఎంపి కొండా సంచలన వ్యాఖ్యలు

### ఫార్మా కంపెనీ ఆలోచన సిఎం విరమించుకోవాలి : ఎంపి డికె అరుణ

**వికారాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** ఫార్మా కంపెనీ వివాదంలో రాజకీయ నేతల హస్తం, గుండాల కుట్ర దాగి ఉందని చేవేళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వాఖ్యలు చేశారు. వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని లగచర్లలో ఫార్మా కంపెనీ భూ అభిప్రాయ సేకరణ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా, పోలీసు అధికారులపై జరిగిన దాడిపై ఆయన స్పందించారు. ఈ విషయమై వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడదూ, ఏమైనా ఇబ్బందులు ఉంటే వినతిపత్రాలు అందించాలని, ధర్నాలు చేయాలి తప్పా దాడులకు దిగడం సరైంది కాదన్నారు. ఈ ఘటనలో ఏ పార్టీ నాయకులు ఉన్నా, ఆఖరుకు మా పార్టీ నేతలు ఉన్నా వదిలొద్దని ఉద్ఘాటించారు. దాడి ఘటనపై నిఘా విభాగాలు వైఫల్యం చెందాయని, నిజంగా వివాదం ఉంటే విచారణ జరపాలని అన్నారు. వివాదాన్ని ప్రోత్స హించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మహబూబనగర్ ఎంపీ డీకె.అరుణ మాట్లాడుతూ, గతంలో నుంచి రైతులు ఫార్మా కంపెనీకి వ్యతెరకమని అక్కడి రైతులు చెప్పారని, వారి భూములు ఇవ్వమని తెగేసి చెబుతున్నారని ఆమె తెలిపారు. కంపెనీ ఏర్పాటైతే ఉద్యోగాలు కూడా రావని, టెక్నికల్‌గా అర్హతలు లేనందుని వారు భూమి కోల్పోతామని తాను వెళ్లినప్పుడు రైతులు మొరపెట్టుకున్నట్లు ఆమె గుర్తు చేశారు. కలెక్టర్‌ను గ్రామంలోకి కొందరు రమ్మని కొందరు పిలిచి కొందరు ఆగంతకులు దాడి చేశారని అన్నారు. ఈ దాడీలో రైతులు, కలెక్టర్‌కు మధ్య తోపులాట జరిగిందని, కలెక్టర్‌కు ఎలాంటి గాయాలు కాలేవని, కడా అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో స్థాయి అధికారిపై తీవ్రంగా దాడి చేయడం బాధాకం మన్నారు. పరిస్థితులు అర్థం చేసుకొని ముఖ్యమంత్రి ఫార్మా కంపెనీ తీసుకోచ్చే నిర్ణయం విరమించుకోవాలని సూచించారు.

## గచ్చిబౌలిలో కి'లేడి'

### సెల్ఫ్‌డ్రైవ్ కార్ల పేరిట ఘరానా మోసం

### అద్దెకు తీసుకున్న కార్లపై లోన్లు

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** సెల్ఫ్‌డ్రైవ్ కార్లు అద్దెకు ఇస్తే రోజుకు రెండు నుంచి ఐదువేలు అద్దె చెల్లిస్తానంటూ కార్లు తీసుకున్న ఓ మహిళ కార్ల యజమానులను మోసంచేసిన ఘటన రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. అద్దెకు తీసుకున్న కార్లపై లోన్లు తీసుకున్న మహిళ యజమానులు అద్దెచెల్లించకుండా టోకరా ఇచ్చింది. గచ్చిబౌలి టెలికాంనగర్ నివాసి ఉషా(48) సెల్ఫ్‌డ్రైవ్‌కోసం కార్లు అద్దెకు ఇస్తే రోజు కు రూ.2వేలు నుంచి రూ.5వేలు చెల్లిస్తానని నమ్మబలికింది. అత్తాపూర్ నివాసముండే సాగర్, అనిల్‌కు కార్లను ఇచ్చి ఒక్కో కారుపై రెండునుంచి నాలుగు లక్షల లోన్ తీసుకుని బయోట్యాగ్‌ను తొలగించి కార్లను బీదర్‌కు తరలించారు. శంషాబాద్‌కు చెందిన గణేష్ స్విఫ్ట్ కారును అద్దెకు ఇవ్వగా ఏకంగా కారు కనిపించడం లేదు. దీంతో గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఉషతో పాటు డ్రైవర్ మల్లేష్(26)పై కేసులు నమోదు చేశారు. కార్లను తనఖా పెట్టిన సాగర్, అనిల్‌లు పరారీలో ఉన్నారు. ఉషను అదుపులోకి తీసుకున్న విచారిస్తున్నారు.

## దేవుళ్లపై ఒట్లువేసి మాటతప్పిన సిఎం రేవంత్‌రెడ్డి : హరీశ్‌రావు

**వేములవాడటౌన్, ప్రభాతవార్త:** దేవుళ్ల మీద ఒట్లువేసి మాట తప్పిన సిఎం రేవంత్ రెడ్డి, ప్రజలు ఎంతో భక్తితో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ని కొలుస్తారని, రాజన్న మీద ఒట్టు పెట్టి రేవంత్ రెడ్డి మాట తప్పాడని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. వేములవాడ రాజన్న దర్శనం అనంతరం మంగళవారం వేములవాడ నియోజకవర్గ ఇంచార్జీ చల్మెడ లక్ష్మి నరసింహ రావు నివాసంలో మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.... పాలకుడే పాపం చేస్తే ఆ రాష్ట్రానికి అరిష్టం పడుతుందని, ప్రజలకు శాపంగా మారుతుందని తెలిపారు. అందుకే రేవంత్ చేసిన పాపం ప్రజలకు శాపం కావద్దని వేములవాడ రాజన్న కు మొక్కుకున్నానని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం చేయాలని వేడుకున్నాని చెప్పారు. పంద్రాగస్టులోపు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని దేవుళ్ళ మీద ఒట్లు వేసి మాట తప్పారని సిఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. పంటలకు మద్దతు ధర రాక, అకాల వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని హరీష్ రావు తెలిపారు. మద్దతు ధర రాకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా గంగుల కమలాపూర్ ఉన్నప్పుడు బిఆర్‌ఎస్ ప్రభుత్వం చివరి గింజ దాకా కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ యొక్క కార్యాలయం, మేడ్చల్ జిల్లా

లేఖ నం.MCB/E1/14/2024-25, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 11.11.2024

బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో సాధారణ నిధుల క్రింద వివిధ అభివృద్ధి పనులకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి http://tender.telangana.gov.in/ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారంపై ఇందుమూలముగా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. మరియు క్రింద పేర్కొన్న తేదీల యొక్క షెడ్యూల్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ నుండి వీక్షించవచ్చును. 1) బిడ్ యొక్క ప్రారంభం: 11.11.2024 సా.04.00 గం. వద్ద. 2) బిడ్ ముగింపు: 18.11.2024 సా.04.00 గం. వద్ద. 3) బిడ్ మూల్యాంకన: 18.11.2024 సా.04.01 గం. వద్ద. మరి ఏ ఇతర వివరాలకైనా మీరు దిగువ సంతకందారున్ని కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును. నోటీస్ బోర్డ్‌పై కాపీ ఏర్పాటు చేయడమైనది.

సం/- కమీషనర్, బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్

DIPR.No.6514-PP/CL/Advt/1/2024-25, తేది: 12.11.2024



BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II,
1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001

I.A NO. 1678 OF 2024
in
O.A.NO. 384 OF 2022

BETWEEN:
STATE BANK OF INDIA,
SARB-2, Chikkadpally, Hyderabad, represented by its Authorized officer, who is Competent sign the Petition as per modified notification in Gazette of India 27.03.1987 issued under Regulation 76(1) R/W Reg 77 of SBI General Regulations, 1955 rep by its authorized officer Sri. V Anil
Under Administrative reasons presently it is represented by State Bank of India, Stressed Assets Recovery Branch - 2, RIC X Roads, Chikkadapalli, Hyderabad. Represented by its Chief Manager Sri G Rameswara Reddy, S/o. G C. Krishna Reddy ...Petitioner/Applicant
And
1. M/s. National Security Services and other ...Respondents/Defendant
To,
1. M/s. National Security Services, Rep. by its Proprietrix Smt. Y. Sumithra, Plot No. 3, Balapur Cross Roads, Balapur, Hyderabad-05.

NOTICE

Whereas the applicant bank has instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial institutions Act 1993 against you for the recovery of a sum of Rs. 57,66,815/- (Rupees Fifty Seven Lakhs Sixty Six Thousands Eight Hundred Fifteen only) mentioned therein together with current and future interest and other relief's. You are hereby required to show cause within ilium 30 days of service of summons by appearing before Hon'ble Tribunal at the above address at 10.3o AM on 18-12-2024 in person or by Pleader/Advocate duly instructed as to why the relier's prayed for should not be granted.
Please take notice that in case of default, the application will be heard and determined in your absence.
(By the Order of the Hon'ble Debt Recovery Trubunal)
Sd/- Registrar
DEBTS RECOVERY TRIBUNAL-II,
FIRST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001


## అమాయక రైతుల అరెస్ట్ సమంజసమా?



చెన్‌గోముల్ పోలీసుల అదుపులో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు

### మాజీ స్పీకర్ మధుసూదనాచారి

### లగచెర్ల రైతుల పరామర్శకు మధుసూదనాచారి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, ఆనంద్, మహేష్‌రెడ్డి అరెస్టు

**పూడూరు, నవంబరు 12, ప్రభాతవార్త:** అమాయక రైతులను అక్రమంగా అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఐఎఎస్ అధికారి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కోడంగల్ మాజీఎమ్మెల్యే నరేం దర్‌రెడ్డి ప్రశ్నిం చారు. వికారాబాద్ జిల్లా కోడం గల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం లగచెర్లలో సోమవారం అధికారులపై జరిగిన దాడికి బాధ్యులను చేస్తూ పోలీసులు రైతులను అరెస్టు చేసిన సందర్భంగా వారిని మంగళవారం పరామర్శిం చేందుకు బిఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్య క్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుండి కోడంగల్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో మన్నెగూడ సమీపంలోకి రాగానే చెన్‌గోముల్ పోలీసులు అడ్డుకొని అరెస్టుచేసి కాసేపటి తరువాత వదిలి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి అనతికాలంలోనే తన బంధువులకు దోచిపెట్టేందుకు లగచెర్లలో ఫార్మా కంపెనీనీ ఏర్పాటు చేసేందుకు యత్ని స్తున్నారని ఆరోపించారు. వ్యవసాయంపై ఆధార పడి జీవించే రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీ ఏర్పాటుకు పూను కోవడం వల్ల ఆందోళ నలు జరుగుతున్నాయని వివరించారు. పార్టీలకు అతీతంగా ఆందోళనలో పాల్గొన్న రైతులను కేవలం బిఆర్‌ఎస్ పార్టీకి ఆపాదించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఇప్పటికైనా సిఎం పద్ధతి మార్చుకొని ఫార్మాసిటీని రద్దు చేసుకోవాలని, లేదా రైతు ఉద్యమం తీవ్రతరమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.



# ఢిల్లీలో నెదర్లాండ్స్ రాయబారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 12:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఢిల్లీలోని తన అధికార నివాసంలో నెదర్లాండ్స్ రాయబారి మరీసా జెరార్డ్‌తో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ ఎండి విష్ణువర్ధన్‌రెడ్డి, ఢిల్లీ రాష్ట్ర రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్‌ఉప్పల్ కూడా పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే గోపినాథ్‌కు ఊరట

## అజారుద్దీన్‌కు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 12:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి ఎన్నిక చెల్లదంటూ భారత మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. అయితే, తన ఎన్నిక చెల్లదంటూ ఆధారాలు లేకుండా వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూడా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కానీ, న్యాయస్థానం గోపినాథ్ పిటీషన్‌ను కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.... సోమవారం మాగంటి పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం... హైకోర్టులో జరిగే విచారణపై స్టే విధించింది. అలాగే మాగంటి గోపీనాథ్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌కు నోటీసులు జారీ చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు ఊరట లభించింది.

# ఢిల్లీ లిక్కర్ స్కాం.. విచారణ మళ్లీ వాయిదా

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణను సిబిఐ ప్రత్యేక కోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసు విచారణ మంగళవారం నాడు ఢిల్లీలోని సిబిఐ ప్రత్యేక కోర్టులో జరిగింది. ఈ విచారణకు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత సహా ఇతర నిందితులు వర్చువల్‌గా హాజరయ్యారు. కేసును విచారించిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు.

# ప్రభుత్వానికి ఇబ్బందులు కల్పించాలని బిఆర్ఎస్ కుట్రలు

## కాంగ్రెస్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయలని పథకం ప్రకారం బిఆర్ఎస్ కుట్రలు చేస్తుందని కాంగ్రెస్ ఎంపి మల్లురవి మండిపడ్డారు. కొడంగల్‌లో భూసేకరణపై వికారాబాద్ కలెక్టర్ గ్రామస్తులతో సమావేశం అయ్యేందుకు వెళ్లారని, బిఆర్ఎస్ నేతల ఆదేశాలతో రైతుల ముసుగులో కలెక్టర్‌పై దాడి చేశారని అన్నారు. అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రాకపోవడంతో ఇలాంటి పనులు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని చూపించాలనే డ్రామాలో భాగంగానే కొడంగల్ ఘటన చేశారన్నారు. ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేకు నిమిషానిమిషానికి ఫోన్లు చేసి, మందు సేవించి కలెక్టర్‌పై దాడి చేశారని అన్నారు. ఇది సిఎం రేవంత్ రెడ్డిపై జరిగిన దాడికాదు, ప్రజాస్వామ్య పాలనపై జరిగిన దాడి అన్నారు. కెసిఆర్ వైఫల్యాలపై కాంగ్రెస్ ఎప్పుడు హింస మార్గంలో పోరాటం చేయలేదని, అహింస మార్గంలోనే మేము కెసిఆర్‌పై పోరాడాం అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, కుటుంబ సభ్యుల మేలుకే కెసిఆర్ పదేళ్ల ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దాడి చేయించి, కెటిఆర్ ఢిల్లీ వచ్చి బిజెపి పెద్దలతో అంతకుముందే ఉన్న చీకటి ఒప్పందంలో భాగంగా గతంలో బిజెపి సహకరించిన విషయాలను గుర్తుచేసి అమృత్ భారత్ స్కాం అంటూ పిర్యాదు చేయడానికి వచ్చారు. బిజెపి నేతలను రెచ్చగొట్టి, రేవంత్‌రెడ్డి పై బురదజల్లే ప్రయత్నం చేశారు. ఏ ప్రాజెక్టు పనులైన టెండర్లు పిలిచే పనులు అప్పగిస్తారు, ఆధారలుంటే సీబీఐకి ఇవ్వాలన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బిఆర్ఎస్ పార్టీ అన్నారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతికత బిఆర్ఎస్‌కు లేదని అన్నారు.



డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ బూసని వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర

# సగరులను వృత్తికులంగా గుర్తించకపోవడం అన్యాయం

## డెడికేటెడ్ కమిషన్ ముందు సంగర సంఘం అభ్యంతరం

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులసర్వే ఫార్మెట్ బుక్ లెట్‌లో వృత్తికులాలను పొందుపరచడంలో సగర కులాన్ని వృత్తి కులంగా పొందుపరచకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వ డెడికేటెడ్ కమిషన్ ముందు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. మంగళవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య భవన్‌లో డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ బూసని వెంకటేశ్వరరావును తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మోదల రవి సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంగిశెట్టి గంగాధర్ సగరలు కలిసి అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలోని బీసీ డీలో ఉన్న సగర కులాన్ని సామాజిక కోణంలో తక్కువ సంఖ్యగా చూపుతూ ప్రభుత్వాలు, పాలకులు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని బిసి కులాలను మాత్రమే వృత్తి కులాలుగా నిర్ధారిస్తూ సమగ్ర కుల సర్వే ఫార్మెట్ బుక్‌లెట్‌లో ముద్రించడం సబబుకాదని అన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు లోనైన నిర్మాణరంగంపై ఆధారపడి ఉప్పర పని కులవృత్తిగా కొనసాగుతున్న తమను ప్రభుత్వ అధికారులు నిర్ధారించకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో సగర కులాన్ని ఇదేవిధంగా గుర్తించకుండా అన్యాయం చేయడానికి చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# రాష్ట్రంలో కొత్తగా 4 డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్

## ప్రస్తుత అవసరాలకు సరిపడేలా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల భర్తీ

## ఆకస్మిక తనిఖీలకు స్టేట్ విజిలెన్స్ టీం ఏర్పాటు

## డిసిఎ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త :** తెలంగాణలో నాసిరకం, నకిలీ మెడిసిన్ తయారు చేసే ముఠా ఆట కట్టించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధమైంది. వాటిని అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) అధికారులను ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వెంగళరావునగర్‌లోని డిసిఎ కార్యాలయలంలో మంత్రి దామోదర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడిసిన్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది 21639 తనిఖీలు నిర్వహించి 3416 సంస్థలపై చర్యలు తీసుకున్నామని డిసిఎ అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఒక్కటే ఉందనీ, దీనివల్ల ఎక్కువ శాంపిల్స్‌ను టెస్ట్ చేయలేకపోతున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ ల్యాబులో నెలకు గరిష్టంగా 400 శాంపిల్స్ మాత్రమే పరీక్షించగలుగుతామనీ, ఈ ఏడాది ఇప్పటి వరకూ 3255 శాంపిల్స్ మాత్రమే టెస్ట్ చేయగలిగామన్నారు. రాష్ట్రంలో 2014 నాటికి సుమారు 20 వేల మెడికల్ షాపులు ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 45 వేలకు పెరిగిందనీ, కానీ, గత పదేళ్లలో డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్స్ రాలేదనీ, కొత్త డ్రగ్ ఇన్స్‌పెక్టర్ల సంఖ్యను పెంచలేదని వివరించారు. దీంతో హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్ అధునీకరణ, కొత్తగా మరో 4 ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. డ్రగ్ ఇన్స్‌పెక్టర్లను వారు పనిచేస్తున్న ఏరియాకు మాత్రమే పరిమితం చేయకుండా ఇతర డ్రగ్ ఇన్స్‌పెక్టర్ల పరిధిలోని సంస్థల్లో తనిఖీలకు పంపించాలని డిజి కమలాసన్‌రెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానాలకు మందులు పంపిణి చేసి కొనుగోలు చేసే విషయంలో టీజీఎంఎస్ఐడీసీకి అవసరమైన సహకారాన్ని డిసిఎ అందించాలని సూచించారు. టీజీఎంఎస్ఐడీసికి మందులు తయారు చేసే సంస్థల యూనిట్లను డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు తనిఖీ చేయాలనీ, ర్యాండమ్‌గా మెడిసిన్ శాంపిల్స్ శాంపిల్స్ సేకరించి టెస్ట్ చేయాలని ఆదేశించారు. మెడిసిన్ ప్రొక్యూర్‌మెంట్‌కు ముందు తరువాత కూడా ఈ ప్రక్రియ కొనసాగాలన్నారు. నిబంధనలు పాటించకపోయినా, నాసిరకం మెడిసిన్ అని తేలినా ఆయా సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు నాణ్యమైన మెడిసిన్ అందించేలా డీసీఏ, టీజీఎంఎస్ఐడీసీ చర్యలు ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, డీసీఏ డిసి కమలాసన్‌రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండి హేమంత్, సిడిఎ జెడి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగైదు నెలల్లో ఎఐ సిటీ నిర్మాణం

## పెట్టుబడులకు హైదరాబాద్ నగరం అనుకూలం

## గ్లోబల్ లాజిక్ సాఫ్ట్‌వేర్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఏఐ రంగానికి పెద్దపీట వేస్తున్నామని, మరో నాలుగైదు నెలల్లో పిపిపి విధానంలో ఏఐ సిటీని నిర్మిస్తామని ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం గ్లోబల్ లాజిక్ సాఫ్ట్‌వేర్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని రకాల పెట్టుబడులకు హైదరాబాద్ అనుకూలంగా ఉందన్నారు. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు హైదరాబాద్‌లో నెలకొల్పుతున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం తగిన తోడ్పాటు నందిస్తుందన్నారు. బహుళజాతి కంపెనీలే కాకుండా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రానున్న నాలుగు నెలల్లో పీపీపీ విధానంలో ఏఐ సిటీ నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కూడా ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి,యువతకు ఉపాధి కల్పిస్తున్నామని తెలియజేశారు. ప్రస్తుతం ఐటీ ఎగుమతులు 12 గా ఉన్నాయని, వాటిని వచ్చే ఐదేళ్లలో 20 చేర్చడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. మలేషియాలో స్థిరపడిన తెలుగు పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. స్కిల్ యూనివర్సిటీ సహాయంతో యువతలో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు. 220కి పైగా జీసీసీలు ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలు, 1.5 లక్షల మంది ఇంజనీర్లతో సహా యేటా 2.5 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ప్రతిభావంతులను తయారు చేస్తున్నామన్నారు. ఈ కొత్త సదుపాయం ఉద్యోగ కల్పనను ప్రోత్సహించడమే కాకుండా అత్యాధునిక ప్రతిభను పెంపొం దిస్తుందన్నారు. అధిక ప్రభావ రంగాలలో మన రాష్ట్ర నాయకత్వాన్ని బలపరుస్తుందన్నారు. ఇది ప్రపంచ వృద్ధి, ఆవిష్కరణలలో అగ్రగామిగా ఉన్న తెలంగాణ స్థానాన్ని పటిష్టం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం తదుపరితరం డిజిటల్ పురోగతికి నాయకత్వం వహించేలా భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తున్నామన్నారు. పెరుగుతున్న కార్యకలాపాలకు మద్దతుగా కొత్త నియామకాలపై దృష్టి సారించాలన్నాని కంపెనీలకు సూచించారు. గ్లోబల్‌లాజిక్‌లోని ఏపీఏసీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్‌ఝా మాట్లాడుతూ వివిధ రంగాలలో మా ఇంజనీరింగ్ సామర్థ్యాలను పెంపొందించడానికి హైదరాబాద్ నగరం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. మా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి)వ్యూహంలో హైదరాబాద్ పాత్రను పటిష్టం చేస్తూ గ్లోబల్ క్లయింట్‌ల పెరుగుతున్న డిమాండ్‌లను తీర్చడానికి ఈ కొత్త కేంద్రం మా బృందాన్ని విస్తరించడానికి అనుమతిస్తుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అనలిటిక్స్,క్లౌడ్ కంప్యూటింగ్, నూతన తరపున సాంకేతికతలలో ప్రత్యేకించి జెన్ ఏఐలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను చేరుకోవడాన్ని మా రిక్రూట్‌మెంట్ ప్రయత్నాలు లక్ష్యంగా చేసుకుంటాయన్నారు. మా గ్లోబల్ కార్యకలాపాలలో మెరుగైన పరిష్కారాలను అందించ డానికి మేము పూర్తిగా సన్నద్ధమ య్యాయన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంటర్ ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అధికారమే పరమావధిగా కాంగ్రెస్ యత్నాలు

## అలవికాని హామీలు ఇవ్వొద్దని ఖర్గే స్వయంగా చెప్పే స్థితి వచ్చింది

## మహారాష్ట్ర ప్రజలతో బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** అలవికాని హామీలు ఇవ్వకండి అభాసుపాలు కాకండి అని వారి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గేనే స్వయంగా చెప్పే పరిస్థితిని తెచ్చుకున్నారని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఢిల్లీ నుండి మహారాష్ట్ర ప్రజలకు ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. భారతదేశ ప్రజలచే తిరస్కరించబడిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఎన్ని అడ్డదారులైనా తొక్కి, అలవికాని హామీలు ఇచ్చి, అధికారమే పరమావధిగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో గ్యారెంటీల పేరిట సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, ఖర్గేల చేత ప్రజాక్షేత్రంలో లక్షల మంది సమక్షంలో హామీలు ఇచ్చి అమలు చేయలేదని అన్నారు. హిమాచల్ ప్రదేశ్ దివాలా తీసిందని, కర్ణాటక చేతులెత్తేశారని, తెలంగాణలో ఉచిత బస్సు తప్ప ఏ హామీ పూర్తిగా అమలు కాలేదన్నారు. అయినా హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో ఎలా ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారో మళ్లీ మహారాష్ట్ర ప్రజానీ కాన్ని కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని మేధావులు, ప్రజలు గమనిం చాలన్నారు. మహారాష్ట్ర ప్రజలు చైతన్యవంతమైన వారు ఇలాంటి ప్రలోభాలను నమ్ముతారని నేను అనుకోవడం లేదన్నారు.

**లగిచెర్ల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం**

లగిచెర్ల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఈటల రాజేందర్ అన్నారు. అక్రమ కేసులు పెడితే మంచిది కాదని అన్నారు. వారిపై కేసులు పెడితే యావత్ తెలంగాణ సమాజం తిరుగుబాటు చేస్తుందని హెచ్చరించారు. ఫార్మా కంపెనీలకు అవ సరమైతే వారే భూసేకరణ చేసుకుంటారు కానీ ప్రభుత్వం మధ్యలో బ్రోకర్‌లాగా వ్యవహరించాల్సిన అవసరం లేదని, మీకు ఓట్లు వేసింది బ్రోకర్‌గిరి చేయడానికి,మధ్యవర్తిత్వం చేయ డానికి కాదన్నారు. రైతాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మా భూములు గుంజుకోకండి, మా ఉపాధి మీద దెబ్బకొట్టకండి అని ఎన్నిసార్లు మొంపెట్టుకున్నా వినకుండా ఫార్మా కంపెనీలకు రైతుల భూములను అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.



# అత్యవసర విచారణలకు ఇకపై మౌఖిక విజ్ఞప్తులు చెల్లవు

## ఇమెయిల్, లిఖితపూర్వక స్లిప్‌లు ఇవ్వాలి

## సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా

**న్యూఢిల్లీ, నవంబరు 12:** సర్వోన్నత న్యాయస్థానంలో ఇకపై అత్యవసర విచారణకు సంబంధించి మౌఖిక నివేదనలు చెల్లవని అత్య వసర విచారణకు లిస్టింగ్‌కోసం న్యాయవాదులు ఇకపై కేవలం ఇమెయిళ్లు, లేదా లిఖితపూర్వక నివేదికలు మాత్రమే అనుమతిసానతమని స్పష్టంచేసారు. సహజంగా న్యాయవాదులు వారి కేసులలను చీఫ్‌ఝస్టిస్ బెంచ్‌ముందు వాదించేసమయంలో అత్యవసర విచారణకోసం విజ్ఞప్తులుచేస్తారు. అయితే సంజీవ్‌ఖన్నా బాధ్యతలుచేపట్టిన తర్వాత కొన్ని మార్పులకు శ్రీకారంచుట్టారు. ఇకపై ఎలాంటిమౌఖిక విజ్ఞప్తులు ఉండవని ఇమెయిల్ లేదా రాసిన స్లిప్పులు, లేఖలు మాత్రమే ఇవ్వాలని అత్యవసర విచారణకుగల కారణాలను వివరించాలని సంజీవ్‌ఖన్నా కోరారు. పౌరప్రయోజనాలకు అనుసంధానమైన అజెండాను న్యాయవ్యవస్థ సంస్కరణల్లో ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయానికి సత్వరమే చేరువయ్యేందుకు పౌరులకు అవకాశం కల్పించాలని, ఎంతటిహోదా ఉన్న వారయినా సరే వారి హోదాతో సంబంధం లేకుండగా అందరికీ న్యాయవ్యవస్థను చేరువచేయడమే లక్ష్యమని అన్నారు. 51వ చీఫ్‌జస్టిస్‌గా ప్రమాణంచేసిన సంజీవ్‌ఖన్నా తొలిరోజే 45 కేసులుపైగా విచారణచేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించినట్లు ఆయన చెప్పారు. కేసుల బ్యాక్‌లాగ్‌నను తగ్గించాని, లిటిగేషన్‌అనేది అందరికీ అందుబాటులోకి రావాలని, సంక్లిష్టమైన న్యాయవ్యవస్థ ప్రక్రియను సరళీకృతంచేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని సంజీవ్‌ఖన్నా ఈసందర్భంగా స్పష్టంచేసారు. న్యాయవ్యవస్థ అన్నివర్గాలకు స్నేహపూర్వక వ్యవస్థగా చేరువకావాలన్నదే తన అభిమతమన్నారు. మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి ముం దుండి నడపాలని ఆయన అన్నారు. విచారణ వ్యవధిని తగ్గించాలని, ఒక క్రమబద్ధమైన విధానాన్ని అనుసరించాలని, న్యాయవిధానాలు పౌరులకు సంకటంగా మారకూడదని ఆయన అన్నారు. వివాదాలను సమర్థవంతమైన మధ్య వర్తిత్వంతో పరిష్కరించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

# వచ్చే యేడాది నుంచి డిగ్రీ సిలబస్‌లో మార్పు!

## బిఎ, బిఎస్సీ, బికామ్ అన్ని కోర్సుల్లోనూ మార్పులు

## కొత్త సిలబస్ రూపకల్పనకు రిటైర్డ్ ప్రొఫెసర్ల సహకారం

## ఉపాధి అవకాశాలే లక్ష్యంగా మార్చనున్న సిలబస్

## కసరత్తు ప్రారంభించిన ఉన్నత విద్యామండలి

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2025-26 నుంచి డిగ్రీలో సిలబస్‌ను పూర్తిస్థాయిలో మార్చడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి అవకాశాలే లక్ష్యంగా సిలబస్‌ను రూపొందించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఇందుకు సంబంధించిన కసరత్తును ఇప్పటికే ప్రారంభించినట్టు తెలుస్తోంది. సిలబస్ మార్పుకి సంబంధించి యూని వర్సిటీలకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

అన్ని డిగ్రీ కోర్సులకి సంబం ధించిన సిలబస్‌ను మార్చాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఉపాధి అవకాశాలు ఉండేలాగా, పరిశ్రమలతో అనుసంధానం అయ్యేలాగా.. కోర్సులు పూర్తికాగానే వెంటనే ఉపాధి అవకాశాలు లభించేటట్టు సిలబస్‌ను రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఉన్నత విద్యా మండలి వర్గాలు చెబుతున్నాయి. గతంలోనే ఇటువంటి ప్రయత్నం ప్రారంభించిన నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నాటికి కొత్త సిలబస్‌ను రూపొందించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. డిగ్రీలోని బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సులకి సంబంధించి పూర్తిస్థాయిలో సిలబస్ మార్పుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సిలబస్ రూపకల్పనలో భాగంగా రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్లతోపాటు ఇప్పటికే రిటైర్డ్ అయిన ప్రొఫెసర్ల సేవలను కూడా సిలబస్ రూపకల్పనలో వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను ప్రారంభించిన నేపథ్యంలో .. ఇకపై విదేశాల్లోనూ ఉన్నత విద్యను కొనసాగించడానికి అలాగే.. పరిశ్రమలతో అనుసంధానం అయ్యేట్టు ఉండేలాగా కొత్తగా సిలబస్‌ను రూపొందించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం సాధారణ డిగ్రీ కోర్సులను అందించే యూనివర్సిటీలు 9వ వరకు ఉన్నాయి. ఉస్మానియా, కాకతీయ, శాత వాహన, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఉన్నాయి. వీటిలో సాధారణ డిగ్రీ కోర్సులను అందిస్తున్నారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సులను అందిస్తున్న నేపథ్యంలో.. ఆ కోర్సులకి సంబంధించిన సిలబస్‌ను పూర్తిస్థాయిలో మార్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 130 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా.. మరో 1000 వరకు ప్రైవేటు డిగ్రీ కాలేజీలున్నాయి. అవికాకుండా వివిధ గురుకులాల అధ్వర్యంలోనూ డిగ్రీ కాలేజీలు కొనసాగుతున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో 4.20 లక్షల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో సుమారు 2.50 లక్షల వరకు సీట్లు భర్తీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ స్థాయిలోనే ఉపాధి అవకాశాలు కల్పించేలాగా సిలబస్‌ను రూపొందించేలాగా ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఇంటింటి సర్వేలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు పాల్గొనాలి

## టిపిసిసి ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్‌కుమార్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొనాలని టిపిసిసి ఎన్నారై సెల్ చైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. గల్ఫ్ దేశాలకు వెళ్లారని చెబితే, రేషన్ కార్డు తీసేస్తారని, రైతు బంధు కట్ చేస్తారని, ఇతర సంక్షేమ పథకాలు వర్తించవని బిఆర్ఎస్, బిజెపిలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని స్పష్టం చేశారు. గల్ఫ్ కార్మికులందరిదీ ఒకే కులం, ఒకే వర్గమని అన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల నష్టపరిహారం గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు, సమస్యలు విన్నవించుకోవడానికి ప్రవాసీ ప్రజావాణిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి ఈ సర్వేలో సేకరించిన సమాచారం ఎంతో కీలకం అవుతుందని వినోద్ అన్నారు. గల్ఫ్ కార్మికులమని చెప్పుకోవడానికి గర్వపడాలని గల్ఫ్ జెఏసి నాయకులు చెన్నమనేని శ్రీనివాస రావు అన్నారు. విదేశాల్లో నివసిస్తున్నవారి వయస్సు, విద్యార్హత, వృత్తి, ఉద్యోగం లాంటి వివరాలతో పాటు గ్రామం, మండలం, జిల్లాల వారీగా డేటా లభ్యమవుతుంది.

# పశుగ్రాస విత్తనాలపై కార్యాచరణ

## పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఘోష్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పెంపకందార్లకు ఉచిత పశుగ్రాస విత్తనాలకోసం వచ్చే 5 ఏళ్లకు కార్యాచరణ, వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో విత్తనాభివృద్ధి సంస్థ, ఇతర ప్రైవేటు సంస్థల ప్రాజెక్టులను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, ఎంటర్‌ప్రైన్యూర్‌షిప్ కార్యక్రమం కింద ఇప్పటి వరకూ రాష్ట్రంలో 412 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ సూచన మేరకు కేంద్రకమిటీ ఆమోదం పొందాకే ప్రాజెక్టులను ప్రారంభించాలని వివరించారు. రాష్ట్రంలో 67 గొర్రెలు, మేకల ప్రాజెక్టులు, 3 పౌల్ట్రీలకు రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు వచ్చాయన్నారు. ఈ పథకా లకు సబ్సిడీలు అందేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.



# వెస్ట్‌మారేడ్‌పల్లిలో వర్ధమాన్ (మహిళా) కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 11వ బ్రాంచ్ ప్రారంభం

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** వర్ధమాన్ (మహిళా)కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మంగళవారం సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని మారేడ్‌పల్లిలో తన 11వ శాఖను ప్రారంభించింది. సురేంద్ర బనిత బ్రాంచ్‌ని ప్రారంభించారు. ఏటీఎంను ప్రదీప్ ఓస్వాల్ ప్రారంభించారు. ఎఫ్‌సిఎ చైర్మన్ శాంతిలాల్ దగా నేతృత్వంలోని బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ గోలేచా స్ట్రాంగ్ రూమ్ ద్వారా అనేక సౌకర్యాలను ప్రారంభించడం జరిగింది. అన్ని ఆధునిక బ్యాంకింగ్ సౌకర్యాలను కలిగి ఉంది. మొబైల్ బ్యాంకింగ్, ఉచిత ఆర్‌టీజీఎస్ , నెఫ్ట్, యూపీఐతో సహా డిజిటల్ లావాదేవీ సేవలను కస్టమర్‌లు పొందవచ్చు. బ్రాంచ్ గోల్డ్ లోన్స్, బిజినెస్ లోన్స్, ఎంఎస్ఎంఈ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ మరియు హౌసింగ్ లోన్స్ అందించనుంది. అసాధారణమైన కస్టమర్ సేవకు పేరుగాంచిన వర్ధమాన్ బ్యాంక్ మారేడ్‌పల్లిలో ఒక నక్షత్ర ఖ్యాతిని నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకుంది. సమావేశాన్ని ఉద్దేశించి చైర్మన్ శాంతిలాల్ దగా మాట్లాడుతూ అగ్రశ్రేణి కస్టమర్ సేవ మరియు సౌకర్యవంతమైన బ్యాంకింగ్‌ను అందించడంలో బ్యాంక్ నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. వర్ధమాన్ బ్యాంక్ ప్రారంభమైనప్పటి నుండి నిలకడగా మంచి పనితీరును కనబరుస్తోందని మరియు లాభదాయకంగా ఉందని చెప్పిన ఆయన 34 ఏళ్ల బ్యాంక్ చరిత్రను హైలైట్ చేశారు. డిజిటల్ ఛానెల్‌లు మరియు మొబైల్ బ్యాంకింగ్ ద్వారా అభివృద్ధి చెందుతున్న బ్యాంకింగ్ ల్యాండ్‌స్కేప్‌కు అనుగుణంగా బ్యాంక్ పనిచేస్తుందన్నారు.

